వర్షాలతో సాగు పనులు షురూ

- కోటి ఆశలతో సాగుకు సన్నద్ధం
- పనుల్లో నిమగ్నమైన రైతులు

రఘునాథపల్లి: ముందస్తు వర్షాలతో ఖరీఫ్ సాగు పనులు మొదలయ్యాయి. దుక్కులు దున్నే పనులను రైతులు షురూ చేశారు. గతేడాది పంటలకు తెగుళ్లు సోకడంతో దిగుబడులు లేక ఆర్థికంగా దెబ్బతిన్న అన్నదాత.. వరుణుడి కరుణతో కోటి ఆశలతో ఖరీఫ్ సీజన్‌కు శ్రీకారం చుట్టారు. వారం రోజులుగా వర్షాలు కురుస్తుండడం.. నేటి నుంచి రోహిణి కార్తె మొదలు కానున్న నేపథ్యంలో ఇప్పుడు విత్తనాలు నాటితే పంటల దిగుబడి బాగుంటుందని భావిస్తున్నారు. ముందస్తు వర్షాల నేపథ్యంలో గతేడాది కంటే ఇప్పుడు వరి, పత్తి సాగు విస్తీర్ణం పెరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. కిందటి సంవత్సరం 22 వేలఎకరాల్లో పత్తి, 350 ఎకరాల్లో మొక్కజొన్న, 200 ఎకరాల్లో కంది పంట సాగు చేయగా ఈ సారి అంతే మొత్తంలో సాగు కానున్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పంట రుణాలు, రైతుభరోసా త్వరగా అందించాలని రైతులు కోరుతున్నారు.


ఇబ్రహీంపూర్‌లో దుక్కులు సిద్ధం చేస్తున్న రైతు


దుక్కిలో ఎండు చెత్తను తొలగిస్తున్న రైతులు

విత్తనాల కొనుగోలు సందర్భంగా రసీదులు తీసుకోవాలి



రైతులు లైసెన్స్‌డ్ వ్యాపారుల వద్దనే విత్తనాలు కొనుగోలు చేసి తప్పనిసరి రసీదులు తీసుకోవాలి. ప్రైవేట్ వ్యక్తుల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి మోస పోవద్దు. విక్రయించిన వారిపై, కొనుగోలుచేసిన వారిపై, చర్యలు తీసుకుంటాం. ఖరీఫ్ సాగు పట్ల రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఏ పంటలు సాగు చేయాలి..? తెగులు రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్నది వివరిస్తున్నాం. వ్యవసాయాధికారుల సూచనలతో సాగు చేపడితే మంచి ఫలితాలు ఉంటాయి.

- కాకి శ్రీనివాస్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి

క్లుప్తంగా

కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే రాజయ్య


కేటీఆర్‌తో మాజీ ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులు, చేపడుతున్న పార్టీ కార్యక్రమాలను కేటీఆర్‌కు వివరించారు. అదేవిధంగా ఇటీవల ఘనంగా నిర్వహించిన బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ విజయవంతం కావడంపై కేటీఆర్‌ను రాజయ్య అభినందించారు.

భూసార పరీక్షలపై శిక్షణ

లింగాలఘణపురం: మండలంలోని వనపర్తిలో శనివారం నేలమ్మ రైతు ఉత్పత్తిదారుల సహకారం సంఘ భవనంలో డిజిటల్ గ్రీన్, జీకోట్ స్వచ్ఛంద సంస్థల సహకారంతో భూసార పరీక్షలపై రైతులకు శిక్షణ ఇచ్చారు. రైతు పొలంలోనే భూసార పరీక్ష చేసుకొనే విధంగా డిజిటల్ గ్రీన్ సంస్థ ప్రతినిధి కమలాకర్ నేలమ్మ ఎఫ్‌పీఓకు కిట్టును అందజేశారు. అదే విధంగా సేంద్రియ వ్యవసాయం, సస్యరక్షణపై అగ్రిఫ్యాబ్రిక్ సంస్థ అవగాహన కల్పించింది. కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, వంచ సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాసు, బలరాంరెడ్డి, అబ్బసాయిలు, సీఈఓ వెంకటేశ్వర్లు, గిరిబాబు, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే కడియంను ఆహ్వానించడం హాస్యాస్పదం'

లింగాలఘణపురం: ఈ నెల 25న మండల కేంద్రంలో మాదిగల ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరిని పిలవడం హాస్యాస్పదమని బీఆర్‌ఎస్ నియోజకవర్గ మహిళా విభాగం కన్వీనర్ ఉడుగుల భాగ్యలక్ష్మి, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు కరుణాకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ మాదిగలను అణగదొక్కుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాదిగలకు చేసింది ఏమీ లేదని, కాంగ్రెస్ పార్టీ కూడా ఏమీ చేయలేదని, బీఆర్‌ఎస్ టికెట్‌తో గెలిచి అధికారం కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు శ్రీహరి, సోషల్ మీడియా మండల అధ్యక్షుడు విష్ణు, బీఆర్‌ఎస్ నెల్లుట్ల గ్రామశాఖ అధ్యక్షుడు రాహుల్, కుమార్, భాస్కర్ పాల్గొన్నారు.

పాలిసెట్‌లో విద్యార్థి ప్రతిభ


సిద్దార్థ

దేవరుప్పుల: మండలంలోని శ్రీ సాయి ప్రశాంతి విద్యానికేతన్ హైస్కూల్‌కు చెందిన కాముని సిద్దార్థపాలిసెట్‌లో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించారు. మండలంలోని సీతారాంపురానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ కాముని నరేందర్, కోమలత దంపతుల కుమారుడు సిద్దార్థం ఇటీవల పదో తరగతి 570 మార్కులు సాధించారు. ఇదే క్రమంలో పాలిసెట్ పరీక్ష ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో 114 (113/130), ఎంబైపీసీలో 129(110.5/130) స్టేట్ ర్యాంకు సాధించడం పట్ల పాఠశాల కరస్పాండెంట్ టి.పాండు కృష్ణ, ప్రిన్సిపాల్ తోటకూరి స్వప్న, ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు.

పరామర్శ


పరామర్శిస్తున్న కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: శివునిపల్లి మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పార్శి శంకర్‌రావు శుక్రవారం మృతిచెందాడు. కాగా, స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి శనివారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. శంకర్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు సీహెచ్.నరేందర్‌రెడ్డి, జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, అభ్యుదయ యువజన సంఘం నియోజకవర్గ కన్వీనర్ పోశాల కృష్ణ, గుర్రం రాజు, గుర్రం ఫాతికుమార్ తదితరులు ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

రఘునాథపల్లి: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి చిన్ననాటి స్నేహితులు అండగా నిలిచారు. కుటుంబ సభ్యుల పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆర్థిక తోడ్పాటునందించారు. మండలంలోని మండెలగూడెంకు చెందిన లింగబోయిన భాస్కర్(40) రోజువారి పనుల నిమిత్తం వెళ్లే క్రమంలో ఆలేరు వద్ద రోడ్డు ప్రమాదంలో ఏప్రిల్ 2వ తేదీన దుర్మరణం చెందాడు. ఆయనకు భార్య, పిల్లలు అశ్విని, సర్వేష్‌లు ఉన్నారు. పిల్లల ఆర్థిక భవిష్యత్ కోసం పదో తరగతి (2000–2001) బ్యాచ్ స్నేహితులు కలిసి రూ.లక్ష అశ్విని పేరిట పోస్టాఫీసులో ఐదు సంవత్సరాలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. పాస్‌బుక్, బాండ్ పేపర్స్‌ను వారు మండెల గూడెం చేరుకొని కుటుంబానికి అందజేశారు. కుటుంబానికి ఆర్థికంగా చేయూతనందించేందుకు చొరవ తీసుకున్న కర్ల కృష్ణవేణిని అభినందించారు. కార్యక్రమంలో స్నేహితులు పెర్ల కనకరాజు, చంద్రమౌళి, హరిప్రసాద్, కుమార్, ప్రవీణ్‌కుమార్, ఉమారాణి, రమాదేవి, వంగ రాజు, యాదవరెడ్డి, కొంగరి కృష్ణ, భవాని, స్వామి, కనకయ్య, రాజశేఖర్, రేవతి, రాజకుమార్, ఝాన్సిరాణి, లలిత, గోపి తదితరులు పాల్గొన్నారు. ఔదార్యం చాటిన స్నేహితులను గ్రామస్తులు అభినందించారు.

స్నేహితుడికి ఆర్థికసాయం

పాలకుర్తి టౌన్: మండల కేంద్రలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2004–2005 పదో తరగతి పూర్వ విద్యార్థులు మానవత్వాన్ని చాటరు. తొటి స్నేహితుడు అనంతో రమణాచారి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు గాయమై నవడవలేని స్థితికి చేరుకున్నాడు. మూడు నెలలుగా శస్త్రచికిత్సలతో బాధపడుతున్న రమణాచారి ఆర్థికంగాకష్టాల్లో ఉన్న విషయం తెలుసుకున్న స్నేహితులు రూ.30 వేల సాయం అందించారు. కార్యక్రమంలో స్నేహితులు రాపాక అనిల్, గాదేపాక కిరణ్, జీడీ సందీప్, చిలువేరు గజేందర్, వడ్లకొండ కుమార్, కొన్నే బద్రి,నిశాంత్, అంజనేయులు, నరేష్,నజీర్,జహంగీర్, సురేష్, నరేష్, వేణుగోపాల్, వీరస్వామి, సరిత, స్వప్న పాల్గొన్నారు.


రఘునాథపల్లి: బాధిత కుటుంబ సభ్యులకు ఫిక్స్‌డ్ డిపాజిట్ పాసు పుస్తకాలు అందజేస్తున్న స్నేహితులు


పాలకుర్తి టౌన్: రమణాచారికి ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

కాటమయ్య రక్షణ కిట్లను వినియోగించుకోవాలి


కాటమయ్య రక్షణ కిట్లను పంపిణీ చేస్తున్న ఎక్సైజ్ సీఐ భాస్కర్‌రావు

- ఎక్సైజ్ సీఐ భాస్కర్‌రావు

స్టేషన్‌ఘన్‌పూర్: కల్లు గీత కార్మికుల ప్రమాదాల నివారణయే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న కాటమయ్య రక్షణ కవచం కిట్లను కల్లుగీత కార్మికులు వినియోగించుకోవాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎక్సైజ్ సీఐ భాస్కర్‌రావు, ఎస్సై డాక్టర్ సుధామాధురి అన్నారు. బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి బి.రవీందర్ ఆదేశాల మేరకు ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గడ్ మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన గీతకార్మికులకు శనివారం కాటమయ్య రక్షణ కవచం కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేజీకేఎస్ మండల అధ్యక్షుడు, కాటమయ్య కిట్‌ల వినియోగం ట్రైనర్ మాచర్ల రఘురాములు గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన వారు కిట్లను అందజేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ కాటమయ్య రక్షణ కవచం కిట్లను ప్రతీ కల్లుగీత కార్మికుడు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ బాల్నె వెంకటమల్లయ్య, ట్రైనర్లు కుర్ర ఉప్పలయ్య, మాచర్ల రఘురాములు, కేజీకేఎస్ నాయకులు గట్టు రమేష్, గడ్డం రాజు, బీసీ వెల్ఫేర్ ఆఫీస్ జూనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, శేఖర్, సురేష్, నర్సింగం తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం


నీలం ఐలేష్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రపంచ కార్మికుల దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రతిష్టాత్మకమైన శ్రమశక్తి అవార్డు అందుకున్న ఐఎన్‌టీయూసీ రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం ఐలేష్, కంపెనీ ప్రెసిడెంట్ పి.మహేందర్‌రెడ్డిని ఎమ్మెల్యే కడియం శ్రీహరి శనివారం హనుమకొండలో ఆయన నివాసంలో ఘనంగా సన్మానించారు. శ్రమశక్తి అవార్డు గ్రహీతలు నీలం ఐలేష్, మహేందర్‌రెడ్డి తదితరులు శనివారం హనుమకొండలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే శాలువాలతో ఘనంగా సత్కరించి వారిని అభినందించారు. ఐఎన్‌టీయూసీ 327 యూనియన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుపోజు రాంబాబు, నాయకులు చెట్టిపల్లి నరేందర్‌రెడ్డి, వీరాంజనేయులు, యాదగిరి, రాజ్‌కుమార్, మహ్మద్ ఫయాజ్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చేందుకే..

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాజు


మాట్లాడుతున్న రాపర్తి రాజు

బచ్చన్నపేట: కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చేందుకే కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో నక్సలైట్లను చంపుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి రాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలో మిన్నాపురం ఎల్లయ్య అధ్యక్షతన ఓ సినిమా థియేటర్‌లో పార్టీ మండల సభ్యులకు ఇస్తున్న రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్రం ఆపరేషన్ కగార్ పేరుతో అటవీ సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టేందుకు ఆదివాసి గిరిజనులను ఎన్‌కౌంటర్ పేరుతో చంపడం దారుణమన్నారు. ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రభుత్వాలకు తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కాగా, మొదట పార్టీజెండాను ఆయన ఆవిష్కరించారు. జిల్లా సభ్యులు సాంబరాజు యాదగిరి, మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్, రావుల రవీందర్‌రెడ్డి, బాల్‌నారాయణ, రాజు, నర్సింహులు, రాములు, ఎల్లయ్య, బలరాంలు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

తరిగొప్పుల: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తమ ఇంటి నిర్మాణాలను తొందరగా చేపట్టాలని ఎంపీడీఓ ఆలేటి దేవేందర్ అన్నారు. శనివారం మండలంలోని వాచ్యతండా పైలెట్ గ్రామంగా ఎంపిక కాగా ఆ గ్రామంలోని ఇంటి నిర్మాణాలను ఎంపీడీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి 69 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 51 ఇళ్లకు మార్కింగ్ ఇచ్చామన్నారు. 32 బెస్మెంట్ లెవల్, 10 రూఫ్ లెవల్ నిర్మాణంలో ఉన్నాయని అన్నారు. భూక్య అంబిక అనే లబ్ధిదారులు ఇంటికి స్లాబ్ వేశారని అన్నారు. మిగతా వారు కూడా ఇంటి నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి భూక్య లింగం, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు భూక్య భాస్కర్, కమిటీ సభ్యులు బానోత్ భాషా, మూడావత్ వెంకటేష్ పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో పరిశీలన చేపట్టాలి

బచ్చన్నపేట: క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక చేయాలని ఎంపీడీఓ వెంకటమల్లికార్జున్ సూచించారు. శనివారం మండలంలోని ఆలింపూర్, బండనాగారం, కొడవటూర్, బసిరెడ్డిపల్లి గ్రామాల్లో పలువురు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎంపికైన లబ్ధిదారుల లిస్టు ప్రకారం పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మళ్లీ పరిశీలన చేసి తుది జాబితాను తయారు చేయాలని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు భరత్‌కుమార్, రేవతి, రూపాచైతన్య, నర్సింహచారి, కారోబార్లు, కమిటీ సభ్యులు పలువురు పాల్గొన్నారు.


బచ్చన్నపేట: లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటమల్లికార్జున్

ఫుట్‌పాత్‌లపై దుకాణాలు పెడితే చర్యలు


దుకాణాలు తొలగించాలని వ్యాపారులకు సూచిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో ఇరువైపులా ఫుట్ పాత్‌లపై దుకాణాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం రాజీవ్‌చౌరస్తాలో వ్యాపారులు ఫుట్‌పాత్ ఆక్రమించుకుని పెట్టిన దుకాణాలు తొలిగించాలని వ్యాపారులకు సూచించారు. వ్యాపారులు ఫుట్‌పాత్ ఆక్రమించుకోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. దుకాణాల ఎదుట ఫుట్ పాత్‌లపై అక్రమంగా ఏర్పాటు చేసిన దుకా ణాలను తొలిగించి ట్రాఫిక్ నియమాలను పాటించకపోతే చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

క్రమశిక్షణపై దృష్టి పెట్టాలి

పోలీసు సిబ్బంది క్రమశిక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఐ గట్ల మహేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్సైలు పవన్‌కుమార్, లింగారెడ్డి, పీఎస్సై రాజేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి


జఫర్‌గఢ్: కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు


బచ్చన్నపేట: శిక్షణలో ఎంఈఓ ఇర్రి వెంకట్‌రెడ్డి

జఫర్‌గఢ్: విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాధికారి రఘునందన్ రెడ్డి అన్నారు. మండలంలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న వృత్యంతర శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ఆటలు, పాటలు, కృత్యాల ఆధారంగా సమర్థవంతమైన చర్చలతో ఉత్తమ విద్య అందించాలన్నారు. శిక్షణలో నేర్చుకున్నవి విద్యార్థులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో రామానుజన్, సోమయ్య, మహేందర్, నాగరాజామ్, సుధాకర్ రెడ్డి, శ్రీకాంత్, శ్రీనివాస్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు రాబట్టాలి

బచ్చన్నపేట: విద్యార్థులకు నాణ్యమైన బోధన చేసి ఉపాధ్యాయులు ఉత్తమమైన ఫలితాలు రాబట్టాలని మండల విద్యాధికారి ఇర్రి వెంకట్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణలో పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకం కలిగేలా చూడాలన్నారు. గ్రామాల్లో బడి బాట కార్యక్రమం ద్వారా ఎక్కువ మంది విద్యార్థులను చేర్చుకునేలా వారి తల్లిదండ్రులతో మాట్లాడాలన్నారు. పలు పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ప్రోత్సాహకాలు అందజేస్తున్న ఎంఈఓ కళావతి

ప్రభుత్వ పాఠశాలలకు ఉపాధ్యాయులు వన్నె తేవాలి

దేవరుప్పుల: మారుతున్న పరిస్థితులను అధిగవిస్తూ ప్రభుత్వ పాఠశాలలకు ఉపాధ్యాయులు వన్నె తెచ్చేలా పాటుపడాలని మండల విద్యాధికారి కళావతి సూచించారు. మండలంలోని చిన్నమడూరు హైస్కూల్‌లో కొనసాగుతున్న ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయుల ఐదు రోజుల శిక్షణా ముగింపు సమావేశంలో పలువురికి ప్రోత్సాహక బహుమతులు అందించారు. సమావేశంలో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలు నల్ల లలిత, పద్మావతి, రమాదేవి, పద్మారాణి, రమేశ్, శంకరయ్య, ఎంఐఎస్ కోఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా టీపీసీసీ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు


జనగామ రూరల్/నర్మెట/బచ్చన్నపేట: టీపీసీసీ అధ్యక్షుడు , ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలను జిల్లాలోని పలు మండలాల్లో కాంగ్రెస్ శ్రేణులు శనివారం ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి, బనుక శివరాజ్, చెంచారపు బుచ్చిరెడ్డి, గంగం నర్సింహారెడ్డి, బడికె ఇందిర, నారాయణరెడ్డి, రాజబోయిన లక్ష్మీనారాయణ, ప్రజ్ఞాపురం శ్రీధర్, జంగిటి విద్యానాథ్, మహాత్మాచారి తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో ప్రశాంత్‌రెడ్డి, శివరాజ్ యాదవ్

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

బచ్చన్నపేట: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన దబ్బగుంటపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దండు కిష్టయ్య (37)కు 2007లో కవితతో వివాహం జరిగింది. జీవనోపాధి కోసం హైదరాబాద్ వెళ్లి పనులను చేసుకుంటూ జీవిస్తున్నారు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో భార్యా భర్తల మధ్య గొడవలు జరిగేవి. నెల రోజుల క్రితం భార్యతో కిష్టయ్య గొడవ పడి స్వగ్రామానికి వచ్చి తల్లిదండ్రులతో ఉంటున్నాడు. కాగా, మనస్థాపంతో శనివారం వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరేసుకుని కిష్టయ్య మృతి చెందాడు. ఘటనా స్థలానికి ఎస్సై ఎస్‌కే అబ్దుల్ హమీద్ చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పాలకుర్తి: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు



జఫర్‌గఢ్: సమ్మేళనంలో పాల్గొన్న 1999-2000 బ్యాచ్ విద్యార్థులు

పాలకుర్తి: మండలంలోని గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల 1997–98 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనాన్ని శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం తమకు విద్య నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కొండపూర్తి విష్ణుమూర్తి, గుగ్గిళ్ల ఎల్లయ్య, మంద భాస్కర్, కొండ శ్రీకాంత్, గుగ్గిళ్ల దేవేందర్, శంకర్, ఉమారాణి, మాధవి, రమ, రజిత, సంధ్యలు పాల్గొన్నారు.

హిమ్మత్‌నగర్‌లో..

జఫర్‌గఢ్: మండలంలోని హిమ్మత్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి 1999–2000 బ్యాచ్ విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. తమకు పాఠాలు నేర్పిన గురువులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు రాజ్‌కుమార్, ముహమ్మద్ జలీల్, ముహమ్మద్ అక్బర్, సోమయ్య, సంపత్, శ్రీనివాస్, సారయ్య,ఎండీ ఖాసిం, వై. సతీష్, మహేందర్, బక్కం రాజు తదితరులు పాల్గొన్నారు.

స్తంభాల మార్పునకు ఖర్చులు భరించాలి

బచ్చన్నపేట : విద్యుత్ స్తంభాలను మార్చాలని కోరే వారు ఆ ఖర్చులు భరించాల్సి ఉంటుందని ట్రాన్స్‌కో ఏడీఈ వేణుమాధవ్ అన్నారు. శనివారం గోపాల్‌నగర్‌లో ఇళ్ల పైనుంచి వెళ్తున్న విద్యుత్ తీగలను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్ లైన్ 20 ఏళ్ల క్రితం వేయడం జరిగిందని, వైర్ల కింద ఇళ్ల నిర్మాణాలకు పంచాయతీ అధికారులు ఎలా అనుమతులు ఇచ్చారో తెలియదన్నారు. ప్రస్తుతం గోపాల్‌నగర్‌లో ఇళ్ల పైనుంచి వెళ్తున్న వైర్లను మార్చేందుకు 29 స్తంభాలు అవసరమవుతుందని, వాటి ఏర్పాటుకు రూ. 10 లక్షల వ్యయం అవుతుందన్నారు. ఇటీవల విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి ఇల్లు విద్యుత్ తీగల కింద ఉండటంతో ప్రమాదం చోటుచేసుకుందన్నారు. ఆయన వెంట ఏఈ రాజ్‌కుమార్, లైన్‌మన్ మెతుకు జలేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఏడీఈ

నిబంధనల ప్రకారం పంట రుణాలు అందించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రిజర్వ్ బ్యాంకు నిబంధనల మేరకు బ్యాంకు డిపాజిట్ల నుంచి 18 శాతం నిధులను రైతులకు పంట రుణాలు అందించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య చందునాయక్ డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా ముఖ్య కార్తకర్తల సమావేశాన్ని స్టేషన్‌ఘన్‌పూర్‌లో శనివారం నిర్వహించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన చందునాయక్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు రైతాంగానికి చేసిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రైతులకు బ్యాంకులు పంట రుణాలు అందించాలని జూన్ 5,6వ తేదీలలో జిల్లా వ్యాప్తంగా బ్యాంకుల ఎదుట ధర్నాలు, రైతులకు ప్రభుత్వాలు చేసిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ జూన్ 11న తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. రైతులు, రైతు సంఘం బాధ్యులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.మంగ బీరయ్య, ఆర్.మీట్యానాయక్, బోడ రాములు, అంజయ్య, యాకయ్య, కుమారస్వామి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చందునాయక్